సాక్షి
తిరుపతి
గురువారం ౹ 14 ౹ నవంబర్ ౹ 2024



ఎంఈడీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జరిగిన ఎంఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు.



సబ్‌స్టేషన్‌లో మంటలు

దొరవారిసత్రం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.



ఉపాధ్యాయుడికి సన్మానం

తిరుపతి అర్బన్: ఉత్తమ ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రమణ్యానికి కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దుశ్శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

న్యూస్‌రీల్

గురుకులానికి శ్రీహరికోట నుంచి తాగునీరు

– రోజుకు 6వేల లీటర్లు

తిరుపతి అర్బన్: సూళ్లూరుపేటలోని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు శ్రీహరికోట షార్ నుంచి తాగునీటిని అందిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల సంస్థ సమన్వయకర్త టి.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజుల క్రితం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూళ్లూరుపేట గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారని చెప్పారు. అక్కడ తాగునీటి సమస్యను గుర్తించిన ఆయన వెంటనే శ్రీహరికోట షార్ డైరెక్టర్‌తో మాట్లాడారని చెప్పారు. ఆ మేరకు వారు పైప్‌లైన్ ఏర్పాటు చేసి, బుధవారం నుంచి రోజూ 6 వేల లీటర్లు తాగునీటిని గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు అందిస్తున్నారని తెలిపారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు.

అర్చకుడి సస్పెన్షన్

భాకరాపేట : తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయంలో అర్చకుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన సీసీ ఫుటేజీని ఎలాంటి అనుమతులు లేకుండా బయటకు లీక్ చేసిన అర్చకుడు సత్యప్రసాద్‌శర్మను సస్పెండ్ చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మమత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో శివప్రసన్న శర్మ, సత్యప్రసాద్ శర్మ ఇటీవల ఘర్షణ పడ్డారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తం అయ్యాయి. అయితే గోప్యంగా ఉండాల్సిన సీసీ కెమెరాలు వీడియో క్లిప్పింగులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు, సోషియల్ మీడియాకు విడుదల చేయడంతో సత్యప్రసాద్ శర్మను అర్చక విధులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయంగా దేవదాయధర్మదాయశాఖ కమిషనర్‌కు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

పక్షుల కేంద్రంలో ట్రైనీ ఐఏఎస్‌లు



పక్షుల కేంద్రంలో ట్రైనీ ఐఏఎస్‌లు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రాన్ని బుధవారం సాయంత్రం తొమ్మిది మంది ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో విడిది చేసే విహంగాలను వీక్షించి, వాటి ప్రాధాన్యత, ప్రాముఖ్యత గురించి స్థానిక ఫారెస్టు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పర్యావరణ కేంద్రంలో విహంగాల జీవన శైలి చిత్రాలను తిలకించారు. కేంద్రానికి విచ్చేసిన ట్రైనీ ఐఏఎస్‌లకు స్థానిక తహసీల్దార్ శైలకుమారి ఏర్పాట్లు చేశారు. వీరి వెంట ఎఫ్ఎస్ఓ బాలయ్య, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, సిబ్బంది ఉన్నారు.

తిరుమలలో వర్షం

ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు, చెట్లు

తిరుమల : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో తిరుమలలో రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. వర్షం ప్రభావంతో రెండో ఘాట్ రోడ్డులోని రెండో మలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా కొండచరియలు, విరిగి పడ్డాయి. వృక్షాలు కూలాయి. దీంతో కొంత సమయం ట్రాఫిక్ అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది రోడ్డుపై పడిన కొండచరియలు, చెట్లను తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. అలిపిరి వద్ద ఎప్పటికప్పుడు వాహన చోదకులను అప్రమత్తం చేసి, ఘాట్‌రోడ్డులో పంపుతున్నారు. టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు ఘాట్ రోడ్డు పరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

కలెక్టర్‌తో ఫైర్ సర్వీసెస్ ఏడీ భేటీ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న జ్ఞానసుందరం

తిరుపతి అర్బన్: ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్ ఆర్.జ్ఞాన సుందరం తిరుపతిలోని కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఓ మొక్క అందజేశారు. ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్లు రాష్ట్రంలో ముగ్గురు ఉంటారు. ఒకరు విశాఖపట్నంలో ఉంటూ ఆ ప్రాంతంలోని ఆరు జిల్లాలను పర్యవేక్షిస్తుంటారు. మరొకరు విజయవాడలో అడ్మిన్‌గా ఉంటారు. ఇంకొకరు విజయవాడ ప్రధాన కార్యాలయంలోనే ఉంటూ పాత రాయలసీమ నాలుగు జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలను పర్యవేక్షిస్తుంటారు. అయితే విజయవాడలో కాకుండా తిరుపతి కేంద్రంగా ఉంటూ ఈ ఏడు జిల్లాలను పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆర్.జ్ఞానసుందరాన్ని తిరుపతికి పంపింది. ఈ క్రమంలో ఆయన తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఆయనకు తిరుపతిలోనే ఓ చాంబర్‌ను కేటాయించనున్నారు.

తేజోవంతులు... తారా జువ్వలు





- చిన్న పిల్లలు కాదు.. పిడుగులు
- ప్రోత్సహిస్తే ఆకాశమే హద్దుగా రాణించే సత్తా ఆ బాలల సొంతం
- పలు రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణింపు
- నేడు బాలలదినోత్సవం

ప్రభాతం పగటిని సూచించినట్లుగా బాల్యం రేపటి మనిషిని నిర్వచిస్తుందన్నారు ఓ మహనీయుడు. నిజమే ప్రతి వ్యక్తికి బాల్యం అనేది దేవుడిచ్చిన వరం. చిన్నారులకు ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి.. కుతూహలం ఉంటుంది. ఆ దిశ అడుగులు వేసి అత్యుత్తమ ప్రతిభతో అదరగొడుతున్న వారెందరో మనముందు కనిపిస్తుంటారు. చదువుతో పాటు ఇష్టమైన రంగంలోనూ దూసుకుపోతుంటారు. గణితంతో అబ్బురపరచాలని..క్రీడల్లో సత్తా చాటాలని..వేదాలు వల్లించి ఔరా అనిపించుకోవాలని..దేశభక్తి చాటాలని.. ఇలా ఎన్నెన్నో రంగాల్లో రాణించాలన్న పట్టుదల, కఠోరశ్రమతో సాధన చేసి, తేజోవంతులుగా విరాజిల్లుతూ.. తారాజువ్వల్లా ఆయా రంగాల్లో దూసుకుపోతున్నారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా వారి ఘనతను స్మరించుకుందాం. – తిరుపతి సిటీ

ఎన్‌సీసీలో బెస్ట్ క్యాడెట్ అవార్డు



దేశభక్తి, క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీలో రాణిస్తూ జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు, అవార్డులు సొంతచేసుకుంటున్నాడు ఆ బాలుడు. తిరుపతికి చెందిన సతీష్‌బాబు, సుమలత దంపతుల తనయుడు **శ్రీకాంత్‌**కు చిన్నతనం నుంచి గొప్ప దేశభక్తి అలవాటైంది. దేశాన్ని రక్షిస్తున త్రివిధ దళాలకు ఇచ్చే శిక్షణను గమనిస్తూ ఎన్‌సీసీలో చేరాలని తల్లిదండ్రులకు తెలపడంతో ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సమయంలో ఎన్‌సీసీలో చేరి అధికారుల శిక్షణలో ప్రతిభ చూపుతూ వచ్చాడు. జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆగస్టు, రిపబ్లిక్‌డే పెరేడ్‌కు ఎంపికై పతకాలను సాధించాడు. ఈ ఏడాది జనవరి 26 రిపబ్లిక్ డే రోజున ఢిల్లీ వేదిక జరిగిన పెరేడ్‌లో పాల్గొని, ఏకంగా ప్రధానమంత్రి నుంచి బెస్ట్ క్యాడెట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ప్రధాని మోదీ శ్రీకాంత్‌కు అవార్డును ప్రదానం చేశారు. జాతీయ స్థాయిలో జరిగిన ఎన్‌సీసీ ఫైరింగ్ పోటీల్లో ప్రథమస్థానం సాధించాడు. ఎన్‌సీసీలోని ఇప్పటివరకు సుమారు 15కు పైగా పతకాలు, అవార్డులు గెలుచుకున్నాడు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న శ్రీకాంత్ ఎన్‌సీసీతో పాటు ఇస్రో, తిరుపతి ఐఐటీ, రీజినల్ సైన్స్ సెంటర్‌లో ఏటా నిర్వహించే సైన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో రాణిస్తూ ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుంటూ చదువులోనూ రాణిస్తున్నాడు. జీవితంలో దేశసేవకు అంకితం కావాలన్నదే తన లక్ష్యమని గర్వంగా చెబుతున్నాడు.

అంకగణితంలో అంతర్జాతీయ స్థాయి



అంతర్జాతీయ స్థాయి పతకం అందుకుంటున్న జోషిత


గణితశాస్త్రంలో అసమాన ప్రతిభ చూపి అంతర్జాతీయ స్థాయిలో ఔరా అనిపిస్తోంది తిరుపతి కేశవాయనగుంటకు చెందిన ఆవుల ఢిల్లీ, రేఖ దంపతుల కుమార్తె **ఎ.జోషిత.** ఈమె చిన్నతనం నుంచి గణితశాస్త్రంలో చురుకుగా కనిపించేది. ఆ బాలిక ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు తిరుపతిలోని అబాకస్ శిక్షకులు సునీతా నాగరాజ్, వినయ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న జోషిత గత మూడేళ్లుగా అబాకస్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. గత రెండేళ్లుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి, పలుసార్లు చాంపియన్‌గా నిలిచింది. ఈ ఏడాది జూలైలో కాకినాడ వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ ప్రోడజీ–2024లో చాంపియన్‌గా నిలిచి, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అలాగే కోల్‌కతా వేదికగా ఈనెల 10వ తేదీన జరిగిన 21వ ఎస్ఐపీ అబాకస్ – మెంటల్ అర్థమెటిక్ ఇంటర్నేషనల్ కాంపిటీషన్‌లో ప్రపంచవ్యాప్తంగా 11 దేశాల నుంచి 7,800 మంది బాలబాలకలు పాల్గొన్నారు. ఇందులో 300 క్లిష్టమైన గణిత సమస్యలను కేవలం 11 నిమిషాల్లో వేగం, కచ్చితత్వంతో సాధించిన జోషిత అడ్వాన్స్‌డ్ లెవల్ నాలుగో విభాగంలో మొదటి స్థానాన్ని సాధించింది. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నదే లక్ష్యమని నిగర్వంగా చెబుతోంది.

స్కేటింగ్ చిరుత



తిరుపతి ఎమ్మార్‌పల్లికి చెందిన కృష్ణారెడ్డి, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు **సి.జతిన్‌రెడ్డి** ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చూపి ఎన్నో పతకాలను సొంతం చేసుకున్నాడు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శిక్షకుడు ప్రేమనాథ్ ఆధ్వర్యంలో స్కేటింగ్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. చదువుతోపాటు స్కేటింగ్‌ను ప్రాణంగా ప్రేమిస్తూ కఠోర సాధన చేయసాగాడు. ఆరు ఏళ్ల వయస్సులోనే రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో మూడు పతకాలు సాధించగా, ఏపీ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు, వెండి పతకాలను సాధించాడు. అలాగే అఖిల భారత స్పీడ్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో మూడు బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. చెన్నై వేదికగా జరిగిన నేషనల్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లోనూ రెండు వెండి పతకాలు, నాగపూర్‌లో జరిగిన ఎన్ఐటీ ఇంటర్నేషన్ రింగ్ స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో మూడు పసిడి పతకాలు సాధించాడు. ప్రతి ఏడాది జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో జతిన్‌రెడ్డిదే ప్రథమస్థానం. ఈ ఏడాది స్కూల్ గేమ్స్‌లో, రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌లోనూ ప్రతిభ చూపిన జతిన్ డిసెంబర్‌లో జరిగే అండర్ –11 జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించి కఠోర సాధన చేస్తున్నాడు. దీంతో పాటు భవిష్యత్తులో సైక్లింగ్‌పై దృష్టి సారించాలనేది ధ్యేయమంటున్నాడు.

వేదమే ప్రాణంగా...



నేటి బాల్యం ఫోన్లలో బిజీగా గడుపుతున్న నేపథ్యంలో పుస్తక పఠనం కరువవుతోంది. కానీ ఆ బాలుడుకి వేదమే ప్రాణం. చిన్ననాటి నుంచి ఆగమ పండితుడిగా రాణించాలన్న లక్ష్యం పెట్టుకున్నాడు తిరుపతికి చెందిన టి బ్రహ్మాచార్యులు, సంతోషి దంపతుల కుమారుడు **తూమాటి వేంకట నరసింహకృష్ణ దీక్షితులు.** వేదం వంట బట్టాలంటే కనీసం 12 ఏళ్ల కఠోర శ్రమతో సంహిత, అరణ్యకం, బ్రాహ్మణం, ఉపనిషత్ పూర్తి స్థాయిలో సాధన చేయాలి. అయితే ప్రస్తుతం వేంకటనరసింహకృష్ణ దీక్షితులు 11 ఏళ్లకే అరణ్యకం పూర్తి చేశాడు. పండితులను తలపించేలా ఇందులోని శ్లోకాలు అనర్గళంగా పలికే స్థాయికి ఎదిగాడు. శ్రీకాళహస్తిలోని జనార్ధనానంద సరస్వతీ స్వామి ట్రస్టు నిర్వహించిన వేద పరీక్షల్లో అరణ్యకం భాగంలో ప్రథమ స్థానంలో నిలచి, సత్తా చాటాడు. ప్రస్తుతం 11 ఏళ్ల ఆ బాలుడు పాఠశాల స్థాయిలో ఎన్నో వేద కార్యక్రమాల్లో పాల్గొని, పండితుల ప్రశంసలు అందుకున్నారు. స్కూల్ స్థాయిలో వేదం తప్ప వేరే ధ్యాస లేని ఆ బాలుడు భవిష్యత్‌లో గొప్ప ఆగమపండితుడిగా రాణించాలనే అతని లక్ష్యానికి తల్లిదండ్రులు తమవంతు సహకారం అందిస్తున్నారు.

రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు



రోడ్డు విస్తరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రేణిగుంట: ఏర్పేడు ఐఐటీ విద్యాసంస్థల నుంచి లాంకో ఫ్యాక్టరీ వరకు, చిందేపల్లి నుంచి రాచగున్నేరి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన శ్రీకాళహస్తి మండలం లాంకో ఫ్యాక్టరీ, ఏర్పేడు మండలం చిందేపల్లి సమీపంలో ఉన్న 400/220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు రోడ్ల విస్తరణ విషయమై శ్రీకాళహస్తి ఆర్డీఓ బానుప్రకాష్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసులు రావు, లాంకో ఫ్యాక్టరీ జీఎం దొరైరాజ్‌లతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం లాంకో కంపెనీ ప్రతినిధులు, విద్యుత్, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమిని పరిశీలించి, సేకరించాలన్నారు. ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, ఏర్పేడు తహసీల్దార్ భార్గవి పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే వాహనాలు సీజ్

తిరుపతి మంగళం : జిల్లా పరిధిలోని వాహనాల త్రైమాసిక పన్ను సకాలంలో చెల్లించని వాహనాలను సీజ్ చేస్తామని తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది చివరి త్రైమాసికంలో చెల్లించాల్సిన వాహనాల త్రైమాసిక పన్ను గడువు అక్టోబర్ లో ముగిసిన కారణంగా ఇంకా పన్ను చెల్లించని వాహనాలపై కేసులు నమోదు చేయాలని మోటార్ వాహనాల తనిఖీ అధికారులకు ఆదేశించామన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2023–24లో మోటారు వాహనాల తనిఖీ అధికారులకు విధించిన లక్ష్యం రూ. 27 కోట్లు కాగా అందులో 95 శాతం లక్ష్యాన్ని సాధించార న్నారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా రూ.30 కోట్లు ల క్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పన్నులు చెల్లించక, వాహనాల ఫిట్‌నెస్ పునరుద్ధరించలేదన్నారు. దీంతో వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు.

విద్యుత్ చౌర్యంపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డిస్కం విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు

తిరుపతి రూరల్: విద్యుత్ చౌర్యంపై దాడులను ముమ్మరం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ సూపరింటెండింగ్ ఇంజినీరు శ్రీనివాసబాబు హెచ్చరించారు. ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ కార్యాలయం విద్యుత్ భవన్‌లో బుధవారం తిరుపతి, చిత్తూరు విజిలెన్స్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా దాడులు, జరిమానాలపై ఆరా తీశారు. విద్యుత్ చౌర్యం ఎక్కడా జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు చౌర్యం జరుగుతున్న చోట మెరుపు దాడులను చేయాలని ఆదేశించారు. విజిలెన్స్ విభాగం తిరుపతి జిల్లా ఈఈ గంగాధరరెడ్డి, చిత్తూరు జిల్లా ఈఈ షణ్ముగం, సిబ్బంది పాల్గొన్నారు.

వరుస చోరీలతో చంద్రగిరిలో కలకలం

చంద్రగిరి: దోపిడీ దొంగలు చంద్రగిరి మండలంలో బీభత్సం సృష్టిస్తున్నారు. వరుస చోరీలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రెండు రోజుల కిందట చంద్రగిరి పట్టణంలో ఓ టీచర్ ఇంట్లో రూ.14 లక్షల విలువైన, 20 సవర్ల బంగారంతో పాటు 200 గ్రాముల వెండి చోరీని మరువక ముందే, తాజాగా ఓ దుకాణంలో చొరబడి నగదు ను దోచుకెళ్లిన సంఘటన మండలంలోని ఐతేపల్లి సమీపంలోని చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. అనంతగుర్రప్పగారిపల్లె(ఏజీపల్లె)కు చెందిన మేడసాని రేణుచౌదరి ఐతేపల్లి జాతీయ రహదారి సమీపంలో బేబి ప్రొవిజన్ స్టోర్స్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి యథావిధిగా దుకాణానికి తాళాలు వేసుకుని ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున అటుగా వెళుతున్న స్థానికులు దుకాణం తెరిచి ఉంచడంతో రేణు చౌదరికి సమాచారం అందించారు. దుకాణం వద్దకు చేరుకున్న ఆయన లోపలికి వెళ్లి పరిశీలించాడు. దుకాణంలోని రెండు క్యాష్ కౌంటర్లలో ఉంచిన రూ.70 వేల నగదును చోరీ జరిగినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని, క్లూజ్ టీం అధికారుల సహకారంతో వేలిముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా దుకాణాన్ని లూటీ చేసే ముందు దుండగులు రెక్కీ చేసినట్లు తెలుస్తోంది.

క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ రవి మనోహరాచారి

తిరుపతి సిటీ: విద్యార్థి దశలో క్రీడలు ఒక భాగం కావాలని, విద్యతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాల్సిన అవసరం ఉందని లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ కే రవిమనోహరాచారి పిలుపునిచ్చారు. ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఎన్జీరంగా అంతర్ కళాశాలల మొదటి దశ క్రీడలు ఘనంగా ముగిశాయి. కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రసంగించారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌ల్లో బాస్కెట్ బాల్ విభాగం, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిన ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు యూ నియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ జి రాంప్రసాద్, కళాశాల అసోసియేటెడ్ డీన్ ఎంవీ రమణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవి కాంత్‌రెడ్డి అవార్డులు ప్రదానం చేశారు.

చంద్రగిరిలో పల్లె బార్లు

- బెల్టు, పర్మిట్ రూమ్‌లతో మద్యం పారిస్తున్నారు
- శాసన మండలిలో ప్రశ్నించనున్న ఎమ్మెల్సీలు
- నేడు తిరుపతిలో ఎక్సైజ్ మంత్రి పర్యటన

తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీతో చంద్రగిరి నియోజకవర్గంలోని పల్లెలు చిత్తవుతున్నాయి. ప్రైవేటు మద్యం షాపులకు అనుసంధానంగా వ్యాపారులు కాసుల కోసం బెల్టు షాపులకు తెరతీశారు. అక్కడితో ఆగకుండా షాపులకు పర్మిట్ రూమ్‌లను ఏర్పాటుచేసి మరీ తాగిస్తున్నారు. పల్లె బార్లను తలపించేలా పర్మిట్ రూమ్‌లు సిద్ధం చేశారు. ఒక్క చంద్రగిరి నియోజకవర్గంలోనే 98 పైగా బెల్టు షాపులను ఏర్పాటు చేశారంటేనే వ్యాపారులు ఎంతకు బరితెగించారో స్పష్టం అవుతోంది. మొత్తం నియోజకవర్గం వ్యాప్తంగా 34 మద్యం షాపులకు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అయితే ఇందులో తొమ్మిది మినహా 25 షాపులకు అనుసంధానంగా పర్మిట్ రూమ్‌లను సిద్ధం చేశారు. ఇక్కడే తినుబండారాలు, మద్యంను సరఫరా చేస్తున్నారు. అమ్మకాలు ఎక్కువగా చేయాలనే లక్ష్యంతోనే పల్లెలకు మద్యంను పంపిస్తున్నారు. పంచాయతీలు కాదు అందులోని పల్లెల వారీగా బెల్టుషాపులను ఏర్పాటుచేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు మద్యం పుష్కలంగా దొరుకుతోంది. నిబంధనలు అతిక్రమణను ఎక్సైజ్, పోలీసులు, రెవెన్యూ అధికారులకు కళ్లెదుటే కనిపిస్తున్నా చర్యలకు మాత్రం జంకుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శాసనమండలిలో ప్రశ్నించనున్న ఎమ్మెల్సీలు

చంద్రగిరి నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు, షాపుల వద్ద పర్మిట్ రూమ్‌ల ద్వారా మద్యం తాగిస్తున్న వైనంపై ఆధారాలను కొందరు సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రికి, ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్సీలకు చేరవేశారు. బెల్టు షాపులపై అరకొరగా జరుగుతున్న దాడుల్లో ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 16 కేసుల నమోదు చేసి 16 మందిని అరెస్ట్ చేశారు. చంద్రగిరిని ఉదాహరణగా తీసుకు ని ఎమ్మెల్సీలు శాసనమండలిలో తమ ప్రశ్నల ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు సమచారం.

ఎక్సైజ్‌ను సరిచేసేనా?

చంద్రగిరి నియోజకవర్గంలో బెల్టు షాపులు, పర్మిట్ రూములపై వెల్లువెత్తుతున్న విమర్శలను కొందరు మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. గురువారం తిరుపతి పర్యటనకు విచ్చేస్తున్న మంత్రికి ఫిర్యాదు చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం తుంగలో తొక్కుతూ సాగుతున్న మద్యం మాఫియా దందాను అరికట్టేందుకు మంత్రి కొల్లు రవీంద్ర ఎలాంటి చర్యలు తీసుకుంటారో అని ఎదురుచూస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి ఏఎస్పీల నియామకం

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి పోలీసు జిల్లాలకు ఏఎస్పీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం ఆదేశాలు జారీచేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కె.జనార్ధన్ నాయుడును తిరుపతి ట్రాన్స్‌కో ఏఎస్పీగా, అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఎస్ఆర్.రాజశేఖర్ రాజును చిత్తూరు ఏఎస్పీగా నియమించారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు



చంద్రగిరి: శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వస్తున్న భక్తులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తులోయలోకి దూసుకెళ్లిన ఘటనలో ఆరుగురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తిరుపతి–మదనపల్లి జాతీయ రహదారి, భాకరాపేట కనుమలోని పెద్ద మలుపు వద్ద బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా జనతానగర్‌కు చెందిన మోహన్ బాబు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం రాత్రి స్విఫ్ట్ డిజైర్ కారులో తిరుమలకు బయలుదేరారు. భాకరాపేట కనుమలోని పెద్ద మలుపు వద్ద వస్తుండగా డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకున్నారు. దీంతో ఒక్కసారిగా వాహనం లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మోహన్‌బాబుతోపాటు కుటుంబ సభ్యులు రేణుక, అనంతమ్మ, కిషోర్ బాబు, వనిత, మోహితకు స్వల్ప గాయాలయ్యాయి. కారులో నుంచి క్షతగాత్రులు ఆర్తనాదాలు చేయడంతో ఆ దారిలో వెళుతున్న వాహనచోదకులు గుర్తించి, 108 వాహనానికి సమచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. అయితే ఎవరికీ ఎటువంటి ప్రాణహాని లేదని, స్వల్ప గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడిగా కృష్ణమూర్తి



తిరుపతి(అలిపిరి): రియల్స్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ లయన్ సాకం కృష్ణమూర్తిని సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్ డివిజన్‌కు డీఆర్‌యూసీసీ సభ్యుడిగా నియమించారు. రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తికి పలువురు అభినందనలు తెలిపారు.

ప్రొఫెసర్ రాజశేఖర్‌కు సత్కారం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

తిరుపతి సిటీ : ఉత్తమ అధ్యాపకుడి అవార్డును అందుకున్న ఎస్వీయూ జువాలజీ ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్‌ను ఏబీఆర్ఎస్ఎం సంఘం వారు బుధవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రతినిధులు ప్రొఫెసర్ త్రిపుర సుందరి, డాక్టర్ బాలసుబ్రమణ్యం, ప్రొఫెసర్ రంజని, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ వివేక్, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

'మలబార్'లో స్వర్ణాకృతి ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో హస్తకళా నైపుణ్యతతో తీర్చిదిద్దిన బంగారు ఆభరణాల స్వర్ణాకృతి ప్రదర్శనను బుధవారం ప్రారంభించారు. షోరూమ్ హెడ్ రెజీష్ మాట్లాడుతూ భారతదేశ వారసత్వాన్ని సమకాలీన డిజైన్లతో అందంగా సమ్మిళితం చేసి తయారు చేసిన ఆభరణాలను సేకరించి ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణకారులచే కళాత్మకత, నైపుణ్యం కలబోసి రూపొందించిన ఆభరణాలు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం రేపు

తిరుపతి కల్చరల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం అన్నారావు సర్కిల్ సమీపంలోని శ్రీబ్రహ్మం గారి ఆలయంలో భారీ అన్నదానం చేపట్టనున్నట్లు అర్చకులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు ఆలయంలో వైభవంగా కార్తీక పూజలు నిర్వహించినట్లు వెల్లడించారు. అన్నదానానికి భక్తులు ధన, వస్తు రూపేణా సాయం చేయవచ్చని సూచించారు.

వైభవంగా పడిపూజ



చంద్రగిరి : మండలంలోని నరసింగాపురంలో బుధవారం అయప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. సుమారు 300 మందికి పైగా అయ్యప్ప స్వాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం కన్నెస్వాములతో అంబళం నిర్మాణం, గణపతి పూజ జరిపించారు. కేరళ శ్రీఅయ్యప్ప స్వామివారి ఆలయ అర్చకుడు త్రివిక్రమన్ నంబూద్రి, గురుస్వామి చంద్రస్వామి ఆధ్వర్యంలో 18 మెట్లకు కర్పూర దీపాలను వెలిగించి పడిపూజను వేడుకగా నిర్వహించారు. మహోత్సవానికి సుమారు రూ.4లక్షల వ్యయంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్ట్

తిరుపతి రూరల్: రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న రామారావు అనే వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరసానాయుడు తెలిపారు.ఎస్ఐలు కవీశ్వర్‌నాయుడు, అంజలి ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో జోషిత ప్రతిభ

తిరుపతి కల్చరల్: కోల్‌కత్తాలో ఈనెల 10న జరిగిన అంతర్జాతీయ అబాకస్ అండ్ మెంటల్ ఆర్థమెటిక్ పోటీలో తిరుపతికి చెందిన ఎ.జోషిత ప్రథమ స్థానం సాధించింది. ఈ పోటీలకు 11 దేశాల నుంచి 7,800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో 300 క్లిష్టమైన గణిత సమస్యలను పరిష్కరించి జోషిత అవార్డు సాధించింది. ఎస్ఐపీ అబాకస్ డైరెక్టర్ కె.సునీత నాగరాజ్, శిక్షకుడు టి.వినయ్ జోషితను అభినందించారు.

వేతన బకాయిలపై ఫిర్యాదు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలోని పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు ప్రసూతి ఆస్పత్రికి వచ్చిన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. పుట్ట మహేంద్ర, కార్మికులు వనజ, నాగజ్యోతి, రాజమ్మ, గుర్రమ్మ, పద్మ, కవిత పాల్గొన్నారు.

గాదంకి చెక్‌పోస్ట్ తనిఖీ

పాకాల : మండలంలోని గాదంకి చెక్‌పోస్ట్‌ను ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఆదేశించారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు





పట్టుదలతో రాణిస్తూ.. పతకాలు సాధిస్తూ..!

- క్రీడల్లో ప్రతిభను కనబరుస్తున్న ఏజీఎం హైస్కూల్ విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న పేదింటి కుసుమాలు
- అవకాశాలను అందిపుచ్చుకుని ఎదుగుతున్న మట్టిలో మాణిక్యాలు

నిరుపేద కుటుంబాల నుంచి వచ్చారు. సర్కారు బడిలో విద్యాభ్యాసం చేస్తున్నారు. అవకాశాలను అందిపుచ్చుకున్నారు. అందుబాటులోని వసతులను సద్వినియోగం చేసుకున్నారు. కోచ్‌ల ప్రోత్సాహంతో ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. ఆకాశమే హద్దుగా క్రీడల్లో రాణిస్తున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్టు జాతీయ స్థాయి పోటీల్లో సైతం సత్తా చాటుతున్నారు. ఈ క్రమంలోనే చదువులోనూ చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు. ర్యాంకుల వెంట పరుగులు తీసే కార్పొరేట్ శక్తుల కళ్లు తెరిపించేలా అద్భుతాలు సృష్టిస్తున్నారు.

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని బైరాగిపట్టిడలో మహాత్మాగాంధీ నగరపాలక (ఎంజీఎం) ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులు సమున్నతంగా ఎదుగుతున్నారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లో సైతం ప్రతిభను చాటుకుంటున్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కదిరి రవి ఆధ్వర్యంలో పీడీ ప్రసన్నలక్ష్మి నేతృత్వంలో విద్యార్థులకు విభిన్న క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా హాకీ, ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, జూడో, రైఫిల్ షూటింగ్, టేబుల్ టెన్నిస్‌లో పిల్లలను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థుల సామర్థ్యం మేరకు క్రీడలను ఎంపిక చేసి పకడ్బందీగా శిక్షణ ఇవ్వడంలో పీడీ ప్రసన్నలక్ష్మి సఫలీకృతమయ్యారు. అలాగే రెజ్లింగ్‌లో ఇందూజ, హాకీలో లక్ష్మీ కరుణ, బాక్సింగ్‌లో కై లాస్‌లు కోచింగ్ ఇస్తున్నారు. పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించిన పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి క్రీడా సామగ్రిని సమకూర్చారు. విశ్రాంత పీఈటీ మునెయ్య అత్యంత విలువైన పరికరాలను వితరణగా అందించారు.



బాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

రెజ్లింగ్‌లో జాతీయ స్థాయికి



తిరుపతికి చెందిన బి.వెంకటేష్, లక్ష్మి దంపతుల కుమార్తె జ్యోతిర్మయి ఎంజీఎం పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఇటీవల కృష్ణా జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం సాధించింది. దీంతో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు మహారాష్ట్ర, గోరఖ్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైంది. అలాగే రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలో పాల్గొనే అవకాశం అందుకుంది. ఇటు చదువులోనూ, అటు క్రీడల్లోనూ రాణిస్తోంది.

- జ్యోతిర్మయి, 8వ తరగతి

'బంగారు' బాట



సొంత ఊరు చవటగుంట అయినప్పటికీ బతుకు దెరువు కోసం తిరుపతికి వచ్చిన పెయింటింగ్ పనిచేసుకుని జీవనం సాగిస్తున్న వెంకటేష్, ఇంద్ర దంపతుల కుమార్తె ప్రణీత. ఎంజీఎం పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఇటీవల కృష్ణా జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం సాధించింది. దీంతో ఈ నెల 16నుంచి 20వ తేదీ వరకు మహారాష్ట్ర, గోరఖ్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైంది. అక్కడ కూడా పతకం సాధిస్తానని ఆత్మవిశ్వాసంతో వెల్లడిస్తోంది.

- టి.ప్రణీత, 7వ తరగతి

హాకీలో రజతం



తిరుపతిలో నివాసముంటున్న లక్ష్మీ, వెంకటేష్ దంపతుల కుమారుడు ఎస్.ముకేష్. ఎంజీఎం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. పీడీ లక్ష్మీప్రసన్న, శాప్ కోచ్ లక్ష్మీకరుణ పర్యవేక్షణలో హాకీలో శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల ఎస్‌జీఎఫ్ అండర్–17 జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టులో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలో సత్తా చాటాడు. వెండి పతకం దక్కించుకున్నాడు.

- ఎస్.ముకేష్, 10వ తరగతి

రాష్ట్ర జట్టులో చోటు



తిరుపతిలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సాంబశివ, శాంతి దంపతుల కుమార్తె ఎ.మహాలక్ష్మి. ఎంజీఎం పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. 6వ తరగతి నుంచే హాకీలో రాణిస్తోంది. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని సత్తా చాటింది. ఈ పోటీల్లో జిల్లా జట్టుకు కాంస్య పతకం దక్కడంలో కీలకపాత్ర పోషించింది. అలాగే తన అపార ప్రతిభతో రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకుంది. జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొననుంది. **- ఎ.మహాలక్ష్మి, 8వ తరగతి**

బాక్సింగ్ క్వీన్



తిరుపతిలో నివాసముంటున్న ప్రైవేటు ఉద్యోగి జి.సోమశేఖర్, జి.గీత దంపతుల కుమార్తె జి.తనుశ్రీ. ఎంజీఎం పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇటీవల తిరుచానూరు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్–17 బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం సాధించింది. దీంతో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. కోచ్ కై లాష్ సూచనలను పాటిస్తూ రాష్ట్ర స్థాయిలోనూ పతకం సాధిస్తానంటూ ధీమా వ్యక్తం చేస్తోంది.

- జి.తనుశ్రీ, 9వ తరగతి

తిరుగులేని పంచ్



తిరుపతిలో చిరు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న నూరుద్దీన్, రషీదా దంపతుల కుమారుడు ఎస్.అర్షద్. ఎంజీఎం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్–17 బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటి బంగారు పతకం సాధించాడు. దీంతో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. గత ఏడాది నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ జూడో పోటీల్లో వెండి పతకం దక్కించుకున్నాడు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లోనూ పతకం సాధిస్తానని చెబుతున్నాడు. **- ఎస్.అర్షద్, 10వ తరగతి**

జాతీయ స్థాయి పోటీలే లక్ష్యం



తిరుపతిలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న బాలాజీ, ఉమ దంపతుల కుమారుడు వై.రంజిత్. ఎంజీఎం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. కోచ్ కైలాష్ పర్యవేక్షణలో బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్–14 బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటాడు. బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయిలోనూ పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడమే లక్ష్యమని చెబుతున్నాడు. **- వై.రంజిత్, 7వ తరగతి**

వర్షపు నీటి కష్టాలు తీర్చాలని వినతి

తిరుపతి రూరల్ : వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని బాలాజీ డెయిరీ అధికారులు కోరారు. బుధవారం ఈ మేరకు గాంధీపురం పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. డెయిరీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా పంచాయతీకి డెయిరీ నుంచి రూ.12లక్షలకు పైగా పన్నులు చెల్లిస్తున్నామని వెల్లడించారు. అధికారులు స్పందించి వర్షపు నీరు చెరువులోకి చేరేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యదర్శి స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



కార్యదర్శికి సమస్య వివరిస్తున్న డెయిరీ ప్రతినిధులు

శ్రీకాళహస్తిలో దళారీల దందా

తిరుపతి కల్చరల్ : శ్రీకాళహస్తిలో దళారీల దందాను అరికట్టాలని పట్టణానికి చెందిన యోగానంద్ విన్నవించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి విచ్చేసే భక్తులను లాడ్జిల్లో గదుల బుకింగ్ పేరిట దళారీలు యథేచ్ఛగా దోచుకుంటున్నారని ఆరోపించారు.పూర్ణేష్ అనే వ్యక్తి తన స్థలంలో డార్మెటరీ నిర్మించి యాత్రికులకు కేవలం రూ.100లకే బెడ్ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. అయితే స్థానికంగా 10 లాడ్జిలను నిర్వహించే ఓ వ్యక్తి తన స్వార్థం కోసం డార్మెటరీపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే కమీషన్ ఏజెంట్లు సిండికేటుగా ఏర్పడి అక్టోబర్ 18వ తేదీన తమపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రాలు అందించామని వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న యోగానంద్

నిరంతరాయంగా చెత్త సేకరణ

తిరుపతి తుడా : నగరంలో నిరంతరాయంగా చెత్త సేకరణ చేపట్టాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. మంగళవారం రాత్రి చెత్తసేకరణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో చెత్త కుప్పల తొలగింపు, సేకరణను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టినట్లు వెల్లడించారు. కార్పొరేటర్ నరసింహాచారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

హౌసింగ్ పురోగతిపై సమీక్ష

కార్పొరేషన్ పరిధిలో పేదల కోసం చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై కమిషనర్ మౌర్య సమీక్షించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పేదల ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హౌసింగ్ డీఈలు శ్రీనివాస రావు, మోహన్, హౌసింగ్ స్పెషలిస్ట్ కాటమరాజు పాల్గొన్నారు



పారిశుద్ధ పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్

ఆస్పత్రికి బెంచీల వితరణ



బెంచ్ ఏర్పాటు చేయిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తిరుపతి తుడా : తిరుపతి ప్రసూతి ఆస్పత్రి వద్ద రూ.2లక్షల విలువైన 22 సిమెంట్ బెంచ్‌లను వితరణగా అందించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సాయిప్రసాద్ తెలిపారు. ఎస్వీ మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాళ్లు వెంకట్, ఎస్ఎన్ మూర్తి, కిరీటి, డాక్టర్ పార్థ సారథిరెడ్డి, క్లబ్ సభ్యులు శ్రీనివాసరావు, సూరి శెట్టి, హరిబాబు, ఏఆర్ రెడ్డి, నిర్మల, బాలాజీ, శశి, జయశంకర్ పాల్గొన్నారు.

'మడకెద్దుల'పై అవగాహన



కథా సంపుటిని చూపుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా, పీజీ కళాశాలలో పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన మడకెద్దుల కథల సంపుటిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తెలుగు విభాగాధిపతి కృష్ణవేణి మాట్లాడుతూ రచయితలను విద్యార్థినులకు పరిచయం చేయడం వల్ల పిల్లల్లో రచనాసక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు కథల సంపుటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కస్తూరి, శోభ, అన్నమ్మ , జ్ఞాన ప్రసూన పాల్గొన్నారు.

త్వరలోనే స్కాలర్‌షిప్ బకాయిల చెల్లింపు

తిరుపతి అర్బన్: పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం త్వరలోనే చెల్లించనుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు బకాయిలు చెల్లించలేదని వారి సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, పరీక్ష రాయడానికి అనుమతి లేదని చెబితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఆ ప్రొఫెసర్‌ను తొలగించాలి'

తిరుపతి సిటీ: ఎస్వీయూలో నిబంధనలకు విరుద్ధంగా నియమించిన ప్రొఫెసర్ కేటీ రామకృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని విద్యార్థి సంఘాలు కోరాయి. బుధవారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతి పత్రం ఇచ్చాయి. సంఘాల నేతలు మాట్లాడుతూ 1997లో విడుదలైన నోటిఫికేషన్‌లో రామకృష్ణారెడ్డిని తాత్కాలిక అధ్యాపకుడిగా నియమించారని, ఆయన పోస్టుకు ఆర్థిక శాఖ ఆమోదం ఇప్పటికీ తెలపలేదన్నారు. మన్నం ప్రేమ్ కుమార్, సుధాకర్,అమృతేజ్, కొండ యుగంధర్, రూకేష్, బద్దే భానుప్రకాష్, సుకుమార్, ప్రభు, ప్రవీణ్, ముని, నరేష్, వెంగళరావు, లిఖిత్, చిచ్చా, పవన్, సాయి,సంపత్ పాల్గొన్నారు.

24న కళాకారుల ఎంపిక

తిరుపతి కల్చరల్ : విజయవాడలో నిర్వహించనున్న సాంస్కృతిక యువజనోత్సవ పోటీలకు ఈ నెల 24వ తేదీన కళాకారుల ఎంపిక చేపట్టనున్నట్లు ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల 18 నుంచి 35 ఏళ్ల వారు బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌కు రావాలని సూచించారు. 9491312522, 9885228869 నంబర్లలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

మెటర్నటీ ఆస్పత్రికి నిధులు

తిరుపతి తుడా : తిరుపతిలోని మెటర్నటీ ఆస్పత్రి అభివృద్ధికి హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ నిధులు మంజూరు చేశారు. బుధవారం నిర్వహించిన సొసైటీ సమావేశంలో ఆజెండాలోని అంశాలను ఆమోదించారు. కమిషనర్ మౌర్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు, డీఎంహెచ్ఓ శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా బర్సీ మహోత్సవం



తిరుపతి కల్చరల్ : గాలిగోపుర మఠంలో బుధవారం బర్సీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి సంవత్సరీకం సందర్భంగా ఈ ఉత్సవం చేపట్టారు. 600 మందికి అన్నప్రసాదాలు వితరణ చేశారు. ప్రత్యేక శిబిరంలో వీజే హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ జ్యోతికుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈఓ మునికృష్ణ పాల్గొన్నారు.

జ్యోతికుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విద్యార్థుల భవితను కాపాడాలని వినతి

తిరుపతి సిటీ : విజయనగరం జిల్లా గరివిడి పశు వైద్య కళాశాలలోని విద్యార్థుల భవితను కాపాడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి కోరారు. బుధవారం ఈ మేరకు తిరుపతి వెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రమణకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గరివిడి పశు వైద్య కళాశాలకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) అనుమతి వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నేతలు ప్రవీణ్, హరికృష్ణ, చంద్ర నాయక్, మోహన్, సురేష్ పాల్గొన్నారు

తిరుపతి కల్చరల్ : గరివిడిలోని పశు వైద్య కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు, రైతు సంఘ నేత టి.జనార్దన్ కోరారు. గరివిడి కళాశాల ప్రారంభించి 5 ఏళ్లు గడుస్తున్నా నేటికీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ఫలితంగా విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

డ్వాక్రా యాప్‌పై అవగాహన

తిరుపతి తుడా : డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించుకునేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ డ్వాక్రా ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం అమెజాన్, ఫ్లిప్ కార్ట్ తరహాలో ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించిందన్నారు. బుక్ చేసుకున్న వస్తువులను ఏడు రోజుల్లోపు డెలివరీ చేసేలా తీర్చిదిద్దారని వెల్లడించారు. కొనుగోలుదారుల నుంచి నగదు నేరుగా డ్వాక్రా మహిళల బ్యాంక్ ఖాతాలోకి జమవుతుందని వివరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, మెప్మా పీడీ రాధమ్మ, సీఎంఎంలు కృష్ణవేణి, సోమకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తిరుపతి అర్బన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి ఈ నెల 20వ తేది వరకు నిర్వహించనున్నట్లు తిరుపతి ప్రాంతీయ గ్రంథాలయాధికారి సూర్యనారాయణ బుధవారం తెలిపారు.

ఆరోగ్యాధికారి తీరుపై నిరసన

తిరుపతి(అలిపిరి): తిరుమలలోని నాలుగో వార్డు హెల్త్ విభాగం సూపర్‌వైజర్ బత్తెయ్యపై చేయి చేసుకున్న ఆరోగ్యాధికారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ నేత సుబ్రమణ్యం మాట్లాడుతూ అనుచితంగా ప్రవర్తించిన హెల్త్ అధికారిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నేతలు కె.వేణు గోపాల్, పి.బుజ్జి, నరేంద్ర, జయంతి , సుందరం, సిద్దు, ప్రభాకర్, కేశవులు, చిరంజీవి, బత్తెయ్య, నాగరాజు, సురేంద్ర పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలని డిమాండ్

పాకాల : ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని బీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ పీఆర్‌సీని ఏర్పాటు చేసి 30శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ మండల అధ్యక్షుడు జ్యోతిప్రసాద్, నేతలు రామ్మూర్తి, ఆంజనేయులు, వెంకటయ్య, ఆదికేశవులు, కృష్ణమూర్తి, జయబాల, రాజేంద్రుడు, గోపాలయ్య, తులసీరామన్, గిరి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంటెక్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ అధికారులు బుధవారం తెలిపారు. మహిళా అభ్యర్థులు గురువారం నుంచి ఈనెల 17వ తేదీ లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంజినీరింగ్ కళాశాలకు హాజరు కావాలని కోరారు.

ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్ : ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలుశిక్ష, రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లా పెనగలూరు మండలం, సిరిపురం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు తోట చిన్న చంగయ్య అలియాస్ పొట్టయ్య, తోట చంగయ్య రెండు ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. కేసు విచారించిన న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధించారు.